క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

మంత్రాలయం: మండలంలోని వగరూరు గ్రామంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ తాలుకా నాయకులు భాస్కర్ యాదవ్ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సంజీవయ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో డ్రయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని, తాగు నీటి వసతి సక్రమంగా లేదని ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉపాధి కూలీలకు వేతనాలు అందించాలని కోరారు. ఆ సంఘం నాయకులు హనీఫ్, మాబు హుసేన్, నరసన్న, శ్రీనివాసులు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

బైక్‌కు నిప్పు


కాలిబూడిదైన బైక్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో గురువారం అర్ధరాత్రి ఇంటి ముందు ఉంచిన హోండా ప్యాషన్ ప్రో బైక్‌కు దుండగులు నిప్పంటించారు. కాలనీకి చెందిన షేక్ రహీద్‌కు చెందిన బైక్‌ను రోజు మాదిరిగానే ఇంటి ముందు ఉంచి ఇంట్లో పడుకున్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. మంటలు ఎగిసిపడుతుండటంతో పక్కింటి వారు గమనించి సమాచారం ఇవ్వటంతో బయటకు వచ్చి చూడగా పూర్తిగా కాలిబూడిదైపోయింది. శుక్రవారం పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. విచారిస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

24న నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు


కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో బీసీ, ఓసీ, కాపు, బలిజ, తెలగ, రెడ్డి, కమ్మ వర్గాలకు సంబంధించిన నిరుద్యోగ యువతకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరు కోసం ఈ నెల 24, 25వ తేదీల్లో మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇంటర్వ్యూల్లో ఆయా బ్యాంకుల మేనేజర్లు పాల్గొంటారన్నారు. దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

కోర్టు భవన నిర్మాణం పరిశీలన


కోర్టు భవన నిర్మాణం గురించి అడిగి తెలుసుకుంటున్న జిల్లా జడ్జి కబర్ధి

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలో నిర్మిస్తున్న కోర్టు భవనాలను కర్నూలు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి కబర్ధి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవన నిర్మాణం గురించి ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ, సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞనారాయణ, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.అర్చన, సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఉన్నారు.

శ్రీశైలానికి తరలిన శివస్వాములు


ఇరుముడిలతో బయలుదేరుతున్న శివస్వాములు

కౌతాళం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శివమాలధరణ చేపట్టిన శివస్వాములు శుక్రవారం శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన శివస్వాములు శ్రీశైల మల్లికార్జున స్వామికి ఇరుముడులను సమర్పించేందుకు బయలుదేరి వెళ్లారు. అంతకుముందు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు గ్రామంలో ప్రత్యేక పూజలు చేపట్టి డప్పు వాయిద్యలతో వారిని సాగనంపారు. శివస్వాములు ముందుగా పవిత్ర పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకుని వాహానాలలో బయలుదేరారు. శివమాల ధరించిన వారిలో 41, 30, 21, 11 రోజుల దీక్ష చేపట్టిన వారు ఉన్నారని, మహాశివరాత్రి రోజున ఇరుముడులను స్వామికి సమర్పించిన తర్వాత శివమాలను విరమించుకుంటారని తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఎమ్మిగనూరుటౌన్: పలు వ్యాధులకు చికిత్సలు చేయించుకున్న రోగులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. 17 మందికి మంజూరైన రూ.18,32,561 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం


తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి అలంకరించిన ఉపాధ్యాయులు,


అష్టదిగ్గజ కవుల నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: భాషా ఉత్సవాలను పురస్కరించుకొని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అలీం సిద్దిఖీ అధ్యక్షతన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి అలంకరించారు. వారు మాట్లాడుతూ.. తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. అనంతరం భువన విజయం, శ్రీకృష్ణ దేవరాయుల అష్టదిగ్గజ కవులతో నాడు నిర్వహించిన సాహిత్య సభను విద్యార్థులు కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. విద్యార్థినీ, విద్యార్థులు గొప్ప కవులు రచించిన కవితలు చదివి వినిపించారు. చిత్రలేఖనం, గేయాలాపన, పద్యాలాపన నాటికలను ప్రదర్శించి తెలుగు భాష గొప్పతనాన్ని చాటి చెప్పారు. తెలుగు ఉపాధ్యాయులు ప్రహ్లాద్, కళ్యాణి, కోటన్న, సీనియర్ ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్, జాన్ అనిల్, పద్మభాయి, సువేద పాల్గొన్నారు.

- ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మాతృభాషా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్ మాట్లాడుతూ.. మాతృ భాష తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లిష్ భాషలపై పట్టు సాధించాలన్నారు. అధ్యాపకులు కిషన్, నరసింహులు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.
- పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవం ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు అధ్యక్షతన ఘనంగా జరుపుకున్నారు. మతృభాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరు మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు మాతృభాషా మహాత్యాన్ని ప్రతిబింబించే ఆకృతులను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


తెలుగు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

- కౌతాళం: మాతృబాష తల్లి లాంటిదని కౌతాళం కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సద్దాంఅలీ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కౌతాళంలోని ప్రతిభ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాతృబాష గొప్పతనం గురించి వ్యాసాలు, తెలుగు కవితలు రాసిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రావ్యమైనది తెలుగు భాష


ఎస్ఎస్ఎస్ హైస్కూల్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

ఎమ్మిగనూరుటౌన్: దేశ భాషల్లో తెలుగు ఎంతో శ్రావ్యమైనదని, భాష అంటే తమ ఉనికి అని ఎస్ఎస్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హరికృష్ణ, తెలుగు తగరం అంజినయ్య, పరమేష్ బాబు,సుజాత, మాదన్న ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా పేర్కొన్నారు.శుక్రవారం పట్టణంలోని పలు ప్రభుత్వ,ప్రైవేట్ కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు.భావవ్యక్తీకరణలో తెలుగుభాషకు అత్యంత సమన్వయ శక్తి ఉందన్నారు. ఉపాధ్యాయులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2025–2026 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. 2013 సెప్టెంబర్1, 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఓసీ, బీసీ విద్యార్థులు, 2011 సెప్టెంబర్1, 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూళ్లలో 5వ తరగతి పూర్తి చేసిన వారు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఈనెల 24 నుంచి మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని వ్యవసాయమార్కెట్ కమిటీ సర్కిల్, ట్యాంక్ బండ్ రోడ్డు, పార్క్ రోడ్డు ప్రాంతాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పట్టణ ప్రజలు తడి,పొడి చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందజేసి స్వచ్ఛ పట్టణంగా మార్చేందుకు సహకరించాలని కోరారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి


కోసిగిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు


బాల్య వివాహాలపై ర్యాలీ చేపట్టిన విద్యార్థులు


పెద్దకడబూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని హెచ్‌ఎం ఇందిరాదేవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం పెద్దహరివాణం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి వీధికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. చిన్నవయస్సులో బాలికలకు వివాహాలు చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, చేసిన వారు, చేయించిన వారు శిక్షార్హులవుతారని చెప్పారు. అనంతరం పాఠశాలలో మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులు తెలుగు తల్లి వేషధారణలో ఆకట్టుకున్నారు. అలాగే సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని కుప్పగల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ శుక్రవారం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ఆపుదాం.. బాల్యాన్ని రక్షిద్దాం

కోసిగి: బాల్య వివాహాలు ఆపుదాం.. బాల్యాన్ని రక్షిద్దామని ఎంఈఓ -2 శోభరాణి సూచించారు. శుక్రవారం కోసిగిలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులచే ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ అధికారుల సమక్షంలో పురవీధుల గుండా అవగాహణ ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మీ బాయి, కాత్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నందవరం: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జెడ్పీ పాఠశాలతో పాటు మిట్టసోమపురం, మాచాపురం, నాగలదిన్నె, ముగతి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో బాల్య వివాహాలను అరికట్టడం, బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టాలని, బాలికలను బడికి పంపాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎంఈఓతో కలిసి పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. డీటీ శశిశేఖర్‌రావు, హెచ్‌ఎం శివరాం పాల్గొన్నారు.

పెద్దకడబూరు: బాల్య వివాహాలు వద్దని, బాలికల చదువులు దేశానికే వెలుగులని కేజీబీవీ ప్రిన్సిపాల్ రుక్సాన పర్వీన్ అన్నారు. బాల్య వివాహాలు దేశానికే ముప్పు అని వివరిస్తూ కస్తూర్బా గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. చిన్నతనంలో పెళ్లిళ్లు చేస్తే కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం కేజీబీవీలో తెలుగు భాషా దినోత్సవం జరుపుకున్నారు. తెలుగు కవుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆదోని టౌన్: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన చిన్న లక్ష్మన్న (41) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు విషయాన్ని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ నగదును కౌన్సిలర్ చలపతి బాధిత కుటుంబానికి అందించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ప్రహ్లాద్, ఆటో లక్ష్మన్న, ఆర్టీసీ మల్లి, మణి, డ్రైవర్ రాము, మదాస్ స్వామి తదితరులు నివాళులర్పించారు.

విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: అనంతపురంలో శనివారం నిర్వహించే ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ, మాదిగ ఉద్యోగ సంఘాల సమాఖ్య రాష్ట్ర అత్యవసర సమావేశానికి ఆయా సంఘాల శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు ఆనంద్‌చైతన్య, జిల్లా ఉపాధ్యక్షుడు గంజిహళ్లి మహదేవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అనంతపురంలో నిర్వహించే సమావేశానికి మందకృష్ణ హాజరుకానున్నారని తెలిపారు.

మహిళ అదృశ్యం

ఆదోని రూరల్: ఆదోని మండలంలోని కుప్పగల్ గ్రామానికి చెందిన ఈరమ్మ (23) అనే మహిళ అదృశ్యమైనట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈరమ్మ పుట్టినిల్లు సిరుగుప్ప కాగా, ఐదేళ్ల క్రితం ఆదోని మండలం కుప్పగల్ గ్రామానికి చెందిన తిరుపతి అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. ఈనెల 19వ తేదీన భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో పుట్టింటికి వెళ్తానని చెప్పి ఈరమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయిందని భర్త తిరుపతి చెప్పాడన్నారు. తర్వాత ఈరమ్మ ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి హుసేనప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటింటి చెత్త సేకరణ

పెద్దకడబూరు: నేటి నుంచి రెండు రోజుల పాటు ఇంటింటి నుంచి చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఎంపీడీఓ నాగరాజుస్వామి సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో పంచాయతీ కార్యదర్శులు క్లాప్ మిత్రల చేత స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేయించాలన్నారు. ఉదయం 6 గంటలకే మొదలు పెట్టి 100 శాతం డోర్ టు డోర్ గార్బేజ్ (ఇంటింటి నుంచి వ్యర్థాలు) కలెక్షన్ పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని ఆదేశించారు.

కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించండి

ఆదోని అర్బన్: మున్సిపల్ కార్మికులు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తి పరిష్కారానికి కృషి చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, సహాయ కార్యదర్శి నాగరాజు, కార్మికులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే పార్థసారథిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మున్సిపల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను పరిష్కరించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే మార్చి 6న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఏఐటీయూసీ పట్టణాధ్యక్షులు వై.టి. భీమేష్, ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా సమితి సభ్యులు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు 'నవోదయం'


ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి

కోసిగి: నాటుసారా నిర్మూలనకు ప్రభుత్వం ఈనెల 19వ తేదీ నుంచి నవోదయం 2.0 కార్యక్రమం చేపడుతున్నట్లు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోసిగి, పెద్దకడబూరు మండలాల్లో నాటుసారా ఆనవాళ్లు ఉన్న ఆరు గ్రామాలను గుర్తించినట్లు చెప్పారు. ఆ గ్రామాల్లో ప్రజలకు, సారా తయారీదారులు, అమ్మకాలు చేపట్టే వారికి అవగాహన కల్పిస్తామన్నారు. సారా విక్రయించే వారిపై దాడులు నిర్వహించి బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. బైండోవర్ తర్వాత మళ్లీ అమ్మకాలు చేపడితే తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి రూ.లక్ష జరిమానా విధిస్తామని చెప్పారు. మహిళా సంఘాలు, గ్రామ కమిటీ సభ్యులు, యువ సంఘాలు, వివిధ శాఖల ఉద్యోగులను భాగస్వాములుగా చేసి గ్రామాల్లో దశల వారీగా నాటుసారాను నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. సారా తయారీ, అమ్మకాలపై 94409 02580 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నవోదయం 2.0 పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రెడ్డి

మంత్రాలయం: మండల పరిధిలోని మాదవరం తండా గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రెడ్డి అవగాహన కల్పించారు. శుక్రవారం గ్రామంలో పర్యటించి.. నాటుసారా అమ్మకాలు చేపట్టినా, తయారు చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటు సారాను నివారించేందుకు గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసి సర్పంచ్, హెచ్‌ఎం, రెవెన్యూ సిబ్బంది, మహిళా సంఘాలు, గ్రామ పెద్దలతో కలిసి ఈ నెల 24, 25వ తేదీల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.

సారా రహిత సమాజానికి పాటుపడదాం

పెద్దకడబూరు: నాటుసారా రహిత సమాజం కోసం పాటుపడుదామని ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి పిలుపునిచ్చారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటు నారా వల్ల కలిగే దుష్పలితాలను వివరించారు. సారా నిర్మూలనపై ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లను బాగు చేయండి

హొళగుంద: గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా మారిన ధణాపురం – హొళగుంద రోడ్డుతో పాటు గ్రామీణ రోడ్లను వెంటనే బాగు చేయాలని బీజేపీ మండల నాయకులు శుక్రవారం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఆర్అండ్‌బీ డీఈఈ వెంకటేశ్వర్లతో పాటు పీఆర్ ఈఈని కలిసి విన్నవించారు. పార్టీ నేషనల్ కౌన్సిల్ మెంబరు చిదానంద, కేవీఎస్ ప్రసాద్, ఉలిగన్న, మహేశ్ తదితరులు రోడ్ల సమస్యపై వినతి పత్రాలు అందించారు. ధణాపురం – హొళగుంద ఆర్అండ్‌బీ రోడ్డు కాంట్రాక్ట్ రద్దయిందని, కొత్తగా టెండర్ పిలిచి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు.

విద్యార్థి బస్సు కొనసాగించాలి

కోసిగి: ఎమ్మిగనూరు నుంచి పల్లెపాడు మీదుగా కోసిగికి విద్యార్థి బస్సును నడపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మార్చి 3వ తేదీ నుంచి ఇంటర్మీడియెట్, తర్వాత పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని, మాలపల్లి, పల్లెపాడు, చింతకుంట గ్రామాల నుంచి సకాలంలో బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పరీక్షల సమయంలో విద్యార్థి బస్సు నడపాలని కోరారు.

అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో నిందితుడి అరెస్ట్

ఆదోని అర్బన్: స్థానిక మండిగిరి పంచాయతీలో ఎగ్గటి ఈశ్వరప్పకు చెందిన 6.71 ఎకరాల భూమిని గత నెలలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో పరారీలో ఉన్న నిందితుడు గొనెగండ్ల మండలానికి చెందిన చాకలి ఈరన్నను శుక్రవారం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు చాకలి ఈరన్నను మీడియాకు చూపుతూ సీఐ సూర్యమోహన్‌రావు వివరాలను వెల్లడించారు. ఎగ్గటి ఈశ్వరప్ప బతికే ఉన్నా నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి, నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్ చూపించి ఆముదాల భాస్కర్ తన తండ్రి అని చెప్పుకుని పట్టా చేసుకుని గోనెగండ్ల మండలానికి చెందిన చాకలి ఈరన్నకు భూమిని రిజిస్ట్రేషన్ చేసిన కేసులో పది మందిపై కేసు నమోదైన విషయం విధితమే. అందులో సబ్‌రిజిస్టర్ ఆజీమియా పరారీలో ఉంటూ బెయిల్ తెచ్చుకున్నాడు. మిగతా ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ క్రమంలో శుక్రవారం ఆస్పరి రోడ్డులో తిరుగుతున్న చాకలి ఈరన్నను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడి గ్రామానికి వెళ్లి అక్రమ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

నీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలి

ఎమ్మిగనూరురూరల్: వేసవి కాలం అరంభం అవుతుండటంతో గ్రామాల్లో తాగునీటిపై ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ బంగారమ్మ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆయాశాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన, చేపట్టే చర్యలను చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు పారిశుద్ధ్యం మెరుగు, ట్యాంకుల శుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో వలసల నివారణకు ఉపాధి పనులు చూపాలని, ప్రజలకు వలసలపై అవగాహన కల్పించాలని చెప్పారు. జెడ్పీటీసీ అనసూయమ్మ, మండల ఉపాధ్యక్షుడు గుడేకల్ పొలయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రుణాలు పారదర్శకంగా అందజేయాలి


మాట్లాడుతున్న టీ.మురళీనాయుడు

గోనెగండ్ల: బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే సబ్సిడీ రుణాల మంజూరు పారదర్శకంగా చేపట్టాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు టీ. మురళీ నాయుడు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రుణాలకు అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియలో కూటమి నాయకుల ప్రమేయం లేకుండా రాజకీయాలకు అతీతంగా పూర్తిగా అర్హత ప్రమాణాలను ఆధారంగా లబ్ధిదారుల జాబితాను అధికారులు స్వతంత్రంగా సిద్ధం చేయాలన్నారు. బీసీల్లోని అన్ని ఉపవర్గాలకు రుణాలు అందించాలని, కొన్ని వర్గాలకు మాత్రమే మంజూరు చేసి మరికొన్ని వర్గాలను విస్మరించేలా వ్యవహరించరాదని సూచించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ కోతలు విధించొద్దు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: గ్రామాల్లో విద్యుత్ కోతలు ఎత్తివేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి రాజీవ్, పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యుత్ కోతలు ఎత్తేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ 13ఏళ్ల క్రితం వాడిన విద్యుత్‌కు సంబంధించి బిల్లులను ఇప్పుడు వసూలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాల్లో ఉపాధి లేక వలసలు వెళ్తుంటే విద్యుత్ బిల్లులు బలవంతంగా వసూలు చేయడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాత బిల్లులు వసూలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారని చెప్పారు. పాత బిల్లుల వసూలు వెంటనే నిలిపివేసి విద్యుత్ కోతలను ఎత్తివేయాలని తహసీల్దార్ కార్యాలయపు ఆర్ఐ హఫీజ్‌కు వినతిపత్రం అందజేశారు. మాబ్బాషా, నరసింహులు పాల్గొన్నారు.

వ్యాధుల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డాక్టర్ శైలేష్‌కుమార్

ఎమ్మిగనూరుటౌన్: క్యాన్సర్ లాంటి వ్యాధులు, వాటి దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలను రాష్ట్రీయ బాల స్వాస్థ్య సమన్వయకర్త డాక్టర్ శైలేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాయలంలో వైద్యులు,మహిళా ఆరోగ్య కార్యకర్తలకు ఎస్‌సీడీ, సీడీ వ్యాధుల స్క్రీనింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులైన రొమ్ము క్యాన్సర్, నోటి, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌లపై రోజుకు 40 గృహాలను సందర్శించి అనుమానితులను గుర్తించాలని సూచించారు. అలాగే 18 సంవత్సరాలు దాటిన వారందరికీ రక్తపోటు, మధుమేహం, రక్తహీనత పరీక్షలు, 30సంవత్సరాలు దాటిన మహిళలకు రొమ్ము,నోటి,గర్భాశయ ముఖ ద్వారపు పరీక్షలను ఇంటింటికీ వెళ్లి చేయాలన్నారు. ఎస్‌సీడీ 3 యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని చెప్పారు. అనంతరం జిల్లా సంచార వైద్య చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు మాట్లాడుతూ బాల్య వివాహల నిర్మూలన, పోషకాహార లోపం నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. వైద్యులు నిస్సిగ్రేసి, జాహ్నవి, శ్రీనివాస బాబు,వీణ,ఎంపీహెచ్‌ఈఓ విజయకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కోసిగి: స్థానిక రైల్వే గేటు సమీపంలో గురువారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం విధితమే. ఘటనపై ఆదోని రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్‌కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. మృతి చెందిన వ్యక్తి కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన బోయ తిమ్మయ్య (65) గా గుర్తించినట్లు చెప్పారు. ఆయన వయస్సు పైబడి గత కొద్ది కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని, రైలు పట్టాలు దాటే సమయంలో జారి కిందపడి చనిపోయినట్లు వివరించారు. అతని భార్య వేరుశనగకాయలు అమ్ముకుని జీవనం సాగిస్తోందని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి



ఆదోని రూరల్: నవోదయం 2.0లో భాగంగా శుక్రవారం ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గువ్వమ్మ సందు కొండల్లో నాటుసారా స్థావరంపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. ఆదోని బోయగేరికి చెందిన బోయ సురేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్ట్ నమోదు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.